సాక్షి
అనంతపురం
సోమవారం । 24 । జూలై । 2023



తండ్రీకొడుకు బలవన్మరణం

శనగల వ్యాపారంలో భారీనష్టం రావడంతో తండ్రీకుమారుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. 8లో



టమాట @ రూ.107

కక్కలపల్లి మండీలో ఆదివారం టమాట కిలో గరిష్ట ధర రూ. 107 పలికింది. కనిష్టం రూ.55, సరాసరి రూ. 87 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.4°/ 22.1°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాలమురళీకృష్ణ


జయరామిరెడ్డి


బాలమురళీకృష్ణ

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం) సంఘం అనంతపురం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేశేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జయరామిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా దుద్దేకుంట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బాలమురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఉపాధ్యాయ భవనంలో ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లాలోని 32 మండలాల కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతో పాటు కోశాధికారిగా వి. లింగానాయక్, గౌరవ అధ్యక్షుడిగా వీఎస్ భాస్కరనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.లక్ష్మీనారాయణ, ఇ.వెంకటరమేష్, వి.మల్లికార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చాగంటి చంద్రమౌళి, హెడ్ క్వార్టర్స్ సెక్రెటరీగా భాస్కరరెడ్డిని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా ఎం.రమణారెడ్డి, ఎం. వెంకటేష్ వ్యవహరించారు. నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయరామిరెడ్డి, బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. అశాస్త్రీయమైన విధానాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

టీడీపీ నాయకుల దాష్టీకం

- దళిత మహిళపై దాడి



యాడికి: నిట్టూరు గ్రామంలో టీడీపీ నాయకులు రాజేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి దాష్టీకం ప్రదర్శించారు. దళిత మహిళ పొలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో పాటు కులం పేరుతో దూషించి, జుట్టుపట్టుకుని కొట్టారు. ఈ మేరకు బాధిత దళిత మహిళ సుజానమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సుజానమ్మ, రాజేశ్వరరెడ్డి పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. సుజానమ్మ పొలాన్ని ఆక్రమించడానికి రాజేశ్వరరెడ్డి ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. శనివారం రాత్రి రాజేశ్వరరెడ్డి మనోహర్‌రెడ్డితో కలిసి మాట్లాడుదామని సుజానమ్మను పిలిపించి కులం పేరుతో దూషించటంతో పాటు ఆమె జుట్టు పట్టుకొని కొట్టాడు. అడ్డుకోబోయిన సుజానమ్మ ఇద్దరు కుమారులపైనా దాడి చేసేందుకు యత్నించారు. బాధితురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకుంది.

పరీక్ష కేంద్రం మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26న ప్రారంభమై సెప్టెంబర్ 8న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించిన విద్యార్థులను ఎస్కేయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలకు బదలాయించారు. దీంతో ఆర్ట్స్ కళాశాలలో పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఈ మార్పును గమనించాలని ఎస్కేయూ యాజమాన్యం కోరింది. మిగిలిన అన్ని పరీక్ష కేంద్రాల్లో యథావిధిగా పరీక్షలు జరుగుతాయి.

పల్లెవించిన వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో జబ్బు చేస్తే చికిత్స కోసం పట్టణాలకు వెళ్లేవారు. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. డబ్బు లేని నిరుపేదలు అంత దూరం వెళ్లలేక జబ్బుతో అలానే బాధపడేవారు. ఇలాంటి వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జగన్ సర్కారు వైద్య సేవలను గ్రామ స్థాయిలోనే అందేలా చర్యలు తీసుకుంది. ప్రతి సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసింది. గత ఏడాది నుంచి అమలులోకి వచ్చిన 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వ్యయప్రయాసలు లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందిస్తోంది.


చిట్టూరు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

పెద్దవడుగూరు మండల కేంద్రానికి 11 కిలోమీటర్ల దూరంలో చిట్టూరు గ్రామం ఉంది. 1,670 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే ఆస్పత్రికి వెళ్లడం కష్టంగా ఉండేది. పెద్దవడుగూరు లేదా 20 కిలోమీటర్ల దూరంలోని పామిడికి వెళ్లాల్సి వచ్చేది. ఇంకొంతమంది పెన్నానది గుండా అవతల వైపున ఉన్న తరిమెలలోని ఆస్పత్రికి వెళ్లేవారు. వర్షాకాలంలో అయితే గర్భిణులను ప్రసవం కోసం పెన్నానదిని దాటి ఆస్పత్రికి తీసుకెళ్లడం అంటే మరింత ఇబ్బందిగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చిట్టూరు మీదుగా పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడి ప్రజల కష్టాలు విన్నారు. ప్రస్తుతం గ్రామంలోనే జగన్ సర్కారు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసింది. చిన్న పిల్లలకు టీకాలు మొదలు గర్భిణులకు వైద్య సేవలు, సీజనల్ వ్యాధులకు చికిత్సలు అందుతున్నాయి.

- తగ్గిన వ్యయప్రయాసలు
- గ్రామీణులకు వరంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- ఓపీతో పాటు టెలి మెడిసిన్ ద్వారానూ వైద్య సేవలు
- ప్రతి గ్రామానికీ వెళ్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య బృందం



అనంతపురం క్రైం/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రజలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా నమ్మకంతో కూడిన వైద్యం అందిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 812 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)/సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటారు. సమగ్ర మాతృ, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ సేవలు, పిల్లలు, కౌమార బాల, బాలికల సేవలు, బీపీ, షుగర్, రక్తహీనత, తదితర వైద్యసేవలందిస్తారు. హెచ్‌బీ, ప్రెగ్నెన్సీ, యూరిన్, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, విజువల్ ఇన్‌ఫెక్షన్ (గర్భసంచి ముఖ ద్వారా కేన్సర్ పరీక్ష), టెస్ట్ ఫర్ అయోడిన్ (థైరాయిడ్ సమస్య రాకుండా) హెపటైటిస్‌బీ, స్పుటమ్, సుఖ వ్యాధులు తదితర మొత్తం 14 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వీటితో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలకు అందించే మందులు, వివిధ రకాల యాంటీబయాటిక్స్ తదితర మొత్తం 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు.

నిపుణుల ద్వారా టెలీ మెడిసిన్ సేవలు..

థైరాయిడ్, బీపీ, షుగర్, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు, గర్భిణులు, చిన్నారుల సమస్యలకు సంబంధించి టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అనంతపురం, కర్నూలు, తిరుపతిలో టెలీ మెడిసిన్ హబ్‌లు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ డాక్టర్లు, గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటూ టెలీ మెడిసిన్ ద్వారా వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సను అందించేలా ఎంఎల్‌హెచ్‌పీలను ఆదేశిస్తారు. ఉమ్మడి జిల్లాలో నెలకు ఎనిమిది వేల మంది వరకు టెలీమెడిసిన్ సేవలు పొందుతున్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు..

గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు గతేడాది అక్టోబర్‌లో 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి పీహెచ్‌సీలో ఉండే ఇద్దరు వైద్యుల్లో ఒకరు ప్రతి గ్రామానికీ 104 వాహనంలో వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. జిల్లాలో '104 వాహనాలు' 36 అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాలు నెలలో 26 రోజుల పాటు ప్రతి గ్రామానికీ వెళ్తాయి.

వైద్యాధికారి ప్రతి గ్రామాన్నీ రెండుసార్లు సందర్శించి తీవ్రమైన, సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులు, బాలింతలు, మానసిక, డీ అడిక్షన్, కౌన్సెలింగ్, సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల బాధితులు, ఆరోగ్య శ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న వారిని పరిశీలించి సేవలందిస్తారు.



అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

అనంతపురం జిల్లాలో..	
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	433
రక్త పరీక్షల రకాలు	14
అందుబాటులో ఉన్న మందుల రకాలు	105
ప్రతి నెలా ఓపీ	5వేల లోపు
నెలలో టెలీమెడిసిన్ సేవలు పొందుతున్న వారి సంఖ్య	5 వేల పైమాటే


ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా జానగొండ ఎర్రిస్వామికి ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న తరిమెల పీహెచ్‌సీ డాక్టర్ ఫిర్దోస్


అనంతపురం మండలం కక్కలపల్లి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో మహిళకు 'టెలీ మెడిసిన్' ద్వారా వైద్యసేవలందిస్తున్న దృశ్యం


తరిమెల పీహెచ్‌సీ పరిధిలోని ఉల్లికంటిపల్లిలో నడవలేని స్థితిలో ఉన్న 73 ఏళ్ల పాపక్క ఓబులమ్మకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శివశంకర్ నాయక్ బృందం

ఊర్లోనే వైద్య సేవలు



నా వయస్సు 92 సంవత్సరాలు. నాకు కాళ్ల నొప్పులు ఉన్నాయి. ఎక్కువ దూరం నడవలేను. ఆస్పత్రికి వెళ్లాలంటే ఇంతకు ముందు ఇద్దరి సాయంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న యాడికి మండల కేంద్రానికి, లేకుంటే 20 కి.మీ దూరంలో ఉన్న తాడిపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మా ఊరి విలేజ్ హెల్త్ క్లినిక్‌లోనే చికిత్స అందిస్తున్నారు.

– లక్ష్మీదేవి, వేములపాడు, యాడికి మండలం

నాణ్యమైన వైద్యం



మా గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ఉన్నా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపైనే ఏఎన్‌ఎం దృష్టి సారించేవారు. దీంతో ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా గుంతకల్లుకు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుత జగన్ ప్రభుత్వం గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి.. అందరికీ వైద్య సేవలు అందిస్తోంది. ఇక్కడే డెలివరీ చేస్తున్నారు.

– సుభద్రమ్మ, నక్కనదొడ్డి, గుంతకల్లు మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



పట్టణ శివారులో నివాసముంటున్నాం. గతంలో ఏదైనా సమస్య వస్తే రాయదుర్గం ఆస్పత్రికి పరుగులు తీసేవాళ్లం. పెద్ద ఎత్తున క్యూ, ఇంటికొచ్చేసరికి చాలా సమయం పట్టేది. ఇప్పుడు మా ఇంటి సమీపంలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశారు. పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలందిస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కవిత, గర్భిణి, భంభంస్వామి ఏరియా, రాయదుర్గం

ఉత్తమ సేవలు



గతంలో వెయ్యి జనాభాకు ఆశా, ఐదువేల జనాభాకు ఏఎన్‌ఎంలు ఉండేవారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారిని ప్రభుత్వం సీహెచ్‌ఓలుగా నియమించింది. ప్రతి 2,500 మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా రక్త పరీక్షలు, మందులు, తదితర ఉత్తమ సేవలందిస్తున్నాం. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ సుజాత నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుని మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ

ముగిసిన హెచ్‌ఎంల శిక్షణ

- నేటి నుంచి రెండో విడత ప్రారంభం

రాప్తాడురూరల్: 'లీడర్ షిప్' అనే అంశంపై ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులుగా అనంతపురం టీటీడీసీ కేంద్రంలో జరుగుతున్న తొలివిడత శిక్షణ ఆదివారంతో ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 184 మంది హెచ్‌ఎంలు పాల్గొన్నారు. సోమవారం నుంచి రెండోవిడత శిక్షణ హెచ్‌ఎంలకు ప్రారంభమవుతుంది. దేశంలోనే విద్యా యాజమాన్య శిక్షణలో ఉత్తమ ఆచరణ పద్ధతులను పాటించే కైవల్య, సత్వ అనే స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ అందించారు. పాఠశాల విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శిక్షణ కేంద్రంలోనే ఉంటూ పర్యవేక్షించారు. విద్యా యాజమాన్య శిక్షణలో అత్యుత్తమ అనుభవం కల్గిన మాస్టర్ ఫెసిలేటర్లు, హెచ్‌ఎంలను శిక్షణలో పూర్తిగా నిమగ్నం చేయించారు. సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య రెండురోజుల పాటు ఉండి శిక్షణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలివిడత శిక్షణ ముగింపు సందర్భంగా పలువురు హెచ్‌ఎంలు మాట్లాడారు. గతంలో ఇలాంటి శిక్షణ ఎప్పుడూ చూడలేదన్నారు. నిజంగా ప్రధానోపాధ్యాయులందరికీ ఇలాంటి శిక్షణ చాలా అవసరం అన్నారు.


పరిశీలకులు, మాస్టర్ ట్రైనర్లతో హెచ్‌ఎంలు

ప్రత్యేక ఆకర్షణగా డీఈఓ పాటలు..

శిక్షణలో భాగంగా రోజూ రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా తరగతుల విన్న హెచ్‌ఎంలకు మనసు ప్రశాంతత ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. రోజూ పాటలు, జోక్స్, డ్యాన్సులు, క్యాంప్ ఫైర్, దాండియా, పద్యాలు, నాటకాలు, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలతో అలరించారు. హెచ్‌ఎంలు చిన్న పిల్లల్లా డ్యాన్సులు వేశారు. ముఖ్యంగా డీఈఓ సాయిరామ్ పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎంతో పని ఒత్తిడి ఉన్నా...శిక్షణను స్వయంగా పర్యవేక్షిస్తూ రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ పాటలు పాడి హెచ్‌ఎంలను ఉత్రూతలూగించారు. డీఈఓ గాయకుడు అనే విషయం తెలియని హెచ్‌ఎంలు ఆయన గొంతునుంచి తెలుగు, హిందీ సినిమా పాటలు విని ఫిదా అయ్యారు.

1,300 ఇంజినీరింగ్ సీట్లు కోత

- 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు లేక దుస్థితి
- మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్
- నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐసీటీఈ అనుమతించిన సీట్లలో మొత్తం 1,300 సీట్లను వర్సిటీ కోత విధించింది. విద్యా ప్రమాణాలు లోపించడం, మౌలిక సదుపాయాల లేమి, అనర్హులైన, అనుభవం లేని ప్రొఫెసర్లతో బోధన, పరిశోధనలు లేకపోవడం, ఏఐసీటీఈ నిబంధనలు పాటించకపోవడం, గత మూడు సంవత్సరాల్లో అనుమతించిన సీట్ల కంటే 30 శాతంలోపు ఇంజినీరింగ్ సీట్లు భర్తీ చేయడం తదితర కారణాలతో ఈ దురవస్థ నెలకొంది. 13 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆ మేరకు సీట్ల కోత విధించారు. ఇందులో ఎక్కువ కంప్యూటర్ సైన్సెస్ సీట్లు కావడం గమనార్హం. మరో వైపు మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు సరైన సదుపాయాలు కల్పించకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ..

ఏపీ ఈఏపీసెట్ –2023కు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వ వరకూ అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. ఆగస్టు 3 నుంచి 8 వరకూ వెబ్ ఆప్షన్ల ఎంపిక, 9వ తేదీ వెబ్ ఆప్షన్ల మార్పు, ఆగస్టు 12న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆగస్టు 13 నుంచి 14 వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్, లేదా నేరుగా కళాశాలలకు వెళ్లి రిపోర్ట్ చేయడం , ఆగస్టు 16 నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ తరగతులు నిర్వహిస్తారు.

ఏపీ ఈఏపీసెట్ –2023 కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎన్ని సీట్లు ఖరారు చేశారనే అంశంపై స్పష్టత వచ్చింది. ఏపీ ఉన్నత విద్యామండలికి జేఎన్‌టీయూ అనంతపురం ఉన్నతాధికారులు అనుమతించిన ఇంజినీరింగ్, ఫార్మసీ సీట్లను నివేదించారు. తద్వారా ఉన్నత విద్యామండలి అనుమతించిన సీట్లకే వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి వీలు కలుగుతుంది.

చిగురిస్తున్న రైతుల ఆశలు

- తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు భారీగా వరద
- త్వరలో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువ
- ఆయకట్టుదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం


జలకళ సంతరించుకున్న తుంగభద్ర జలాశయం

అనంతపురం సెంట్రల్: కళావిహీనంగా మారిన జలాశయాలు ఇప్పుడిప్పుడే జలకళ సంతరించుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో సరైన వర్షాలు కురవలేదు. ఆలస్యంగానైనా కొద్దిరోజులుగా కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతోంది. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆదివారం నుంచి వరద మొదలైంది. ఈ రెండు జలాశయాలకు గణనీయంగా వరద చేరుతుండడంతో తుంగభద్ర, హంద్రీ–నీవా ఆయకట్టు దారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలోనే నీటి విడుదలపై కబురు అందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాగు–సాగుకు ఆ ప్రాజెక్టులే ఆధారం..

అనంతపురం జిల్లాకు ప్రధాన నీటి వనరులు హంద్రీ–నీవా, తుంగభద్ర ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టులే తాగు–సాగునీటికి ఆధారం. మూడేళ్లుగా విస్తారమైన వర్షాలు రావడంతో తుంగభద్ర, కృష్ణా జలాలు వచ్చాయి. ఈ ఏడాది ప్రారంభంలో వర్షాలు వచ్చినా అదనులో చినుకు జాడ లేకుండా పోయింది. జిల్లాలోనే కాకుండా కర్ణాటకలో కూడా వర్షాలు కురవలేదు. దీంతో తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకున్నాయి. 10 రోజుల క్రితం వరకూ పూర్తిగా అడుగంటాయి. ఇటీవల వర్షాలు ప్రారంభం కావడంతో జలాశయాల్లోకి ఇన్‌ఫ్లో మొదలైంది.

భారీగా వరద..

జలాశయాల పరిస్థితి రెండురోజుల్లో పూర్తిగా మారిపోయింది. భారీ వర్షాలకు వరద పోటెత్తుతోంది. తుంగభద్ర జలాశయానికి ఆదివారం ఏకంగా 59,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. మొత్తం నీటి సామర్థ్యం 105.78 టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 21.356 టీఎంసీలకు చేరింది. మరో 15 టీఎంసీల చేరికతో హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసుకోవచ్చు. గతేడాది ఇదే సమయంలో 104.503 టీఎంసీలు ఉంది. 48412 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలేశారు. నెలరోజులకు పైగా వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందకు పంపారు.

- శ్రీశైలం జలాశయానికి కూడా ఆదివారం నుంచి ఇన్‌ఫ్లో మొదలైంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి 37,124 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం డ్యాంలో 33.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలోకి 43 టీఎంసీలకు (834 అడుగులకు) నీటి మట్టం చేరితే హంద్రీ–నీవాకు నీటిని ఎత్తిపోసుకోవచ్చు.

ఆశాజనకంగా వరద

తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు వరద ఆశాజనకంగా వస్తోంది. కొద్దిరోజులుగా వర్షాభావంతో నీరు పెద్దగా రాలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో మొదలైంది. ఇదే పరిస్థితి కొనసాగితే రెండు వారాల్లోపు జలాశయాలు నిండే అవకాశం ఉంది. మరికొద్దిరోజుల్లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. – దేశేనాయక్, రాజశేఖర్, ఎస్‌ఈలు, హంద్రీ–నీవా, హెచ్చెల్సీ

వైభవంగా గూగూడు ఉత్సవాలు


గూగూడులో కొలువైన కుళ్లాయిస్వామి


అగ్ని గుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున అర్చకుడు హుసేనప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భక్తుల రద్దీని నియంత్రించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఈఓ శోభ, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, శివయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి నేతపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు

రాప్తాడురూరల్: బీసీ విద్యార్థి సంఘం నాయకుడు విష్ణువర్ధన్ ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడంటూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరస్పాండెంట్ల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా విద్యార్థి సంఘాల పేరుతో మాట్లాడుతున్నారని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఏ స్కూల్‌లోనూ పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన సీఐ రెడ్డెప్ప సదరు విద్యార్థి సంఘ నాయకుడిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలి తప్ప బెదిరించేలా మాట్లాడితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐను కలిసిన వారిలో ఏడీపీఎస్‌ఏ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి రామచంద్ర, సీఈఓ రవి చంద్రారెడ్డి, నగర గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సభ్యులు మద్దయ్య, రామాంజనేయులు, విజయ్, రఫీ, జానకీరాములు, శ్రీవాత్సవ, వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా .. యువకుడి మృతి



ఘటనాస్థలంలో గాయాలతో హరీష్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని భట్టువానిపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న ప్రమాదంలో కోడిపల్లికి చెందిన హరీష్ (23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంలో భట్టువానిపల్లికి బయలుదేరిన హరీష్... గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కింద పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హరీష్‌ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అంతా మా ఇష్టం

అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న వెంకటేష్ (పేరు మార్చాం) వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేశాడు. డెలివరీ చేసేందుకు వచ్చిన బాయ్ సిలిండర్ దించి బిల్ ఇచ్చి రూ.1,200 అడిగాడు. బిల్‌లో రూ.1,170 ఉందికదాని అడిగితే... డెలివరీ చార్జి రూ.30 ఇవ్వాలన్నాడు. డెలివరీ చార్జీ లేదుకదా అంటే... అదంతా మాకు తెలీదు... రూ.30 ఇవ్వండి... లేకపోతే సిలిండర్ వెనక్కు తీసుకెళతానంటూ భుజానికి ఎత్తుకున్నాడు. ఈ అనుభవం వెంకటేష్ ఒక్కడిదే కాదు... వంట గ్యాస్ సిలిండర్ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ ఇలానే ఇబ్బందులు పడుతున్నారు.

- వంట గ్యాస్ సిలిండర్ డెలివరీలో సిబ్బంది చేతివాటం
- సిలిండర్‌పై రూ.30 అదనంగా వసూలు
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు



గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఇంటింటికి వంట గ్యాస్‌ను డెలివరీ చేసే సిబ్బంది ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. రవాణా చార్జీల పేరుతో డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి సిలిండర్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా నెలకు రవాణా చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి రూ.53 లక్షలకు పైగా అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు సమాచారం.

నిబంధనలు బేఖాతర్

గ్యాస్ రవాణాకు సంబంధించి పైసా కూడా చెల్లించరాదంటూ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయితే అవన్నీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. వినియోగదారులు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలకు సంబంధించి 51 వంట గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఇందులో ఐఓసీఎల్ 3,58,936, హెచ్‌పీసీఎల్ 1,29,795, బీపీసీఎల్ 1,78,557 కనెక్షన్లు చొప్పున మొత్తం 6,67,288 గృహవసర వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో రోజువారీగా అన్ని ఏజెన్సీల పరిధిలో ఎంత లేదన్నా 7వేల సిలిండర్లను డెలివరీ చేస్తుంటారు. ఈ లెక్కన నెలకు సగటున 1.75 లక్షల గ్యాస్ సిలిండర్లను వినియోదారులకు అందజేస్తున్నారు.

తనిఖీలు లేకపోవడంతోనే..

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అధిక వసూళ్లపై ఫిర్యాదు చేస్తే సిలిండర్లు సక్రమంగా ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. 15 కిలోమీటర్ల లోపు వరకు సిలిండర్ డెలివరీ ఉచితంగా చేయాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా డెలివరీ బాయిస్ వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. గృహవసర వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం 1,170 ఉండగా, డెలివరీ బాయిస్ మాత్రం రూ.1,200 నుంచి రూ.1,210 చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క దానిపై రూ.30 చొప్పున లెక్కేసుకున్నా.. రోజుకు 7వేల సిలిండర్లపై రూ.2.10 లక్షలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా నెలసరి (25 రోజులు) రూ.52.50 లక్షలు మేర గ్యాస్ డెలవరీ బాయిస్ స్వాహా చేస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ఇలా....

- నగరాలు, పట్టణాల్లో రవాణా చార్జీలు వసూలు చేయకూడదు
- మునిసిపల్ పరిధి నుంచి 15 కిలోమీటర్లు పరిధిలోని గ్రామాల్లో డెలివరీకి వసూలు చేయరాదు

జిల్లాలో కంపెనీల వారీగా గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఇలా...	
కంపెనీ	కనెక్షన్లు
ఐఓసీఎల్ (ఇండియన్)	3,58,936
హెచ్‌పీసీఎల్ (హెచ్‌పీ)	1,29,795
బీపీసీఎల్ (భారత్)	1,78,557
మొత్తం కనెక్షన్లు	6,67,288

రోజుకు సిలిండర్ల డెలివరీ : 7వేలు

నెలసరి (25 రోజులు) డెలివరీ: 1.75 లక్షలు

- డీలర్ పరిధి నుంచి 15 కిలోమీటర్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో డెలివరీకి చార్జీ వసూలు చేయకూడదు.
- కష్టతరమైన, ప్రత్యేక ప్రాంతాలు (కొండ, అటవీ, తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలు) డెలివరీ చార్జీ వసూలు చేయకూడదు
- గ్యాస్ సిలిండర్ సరఫరా విషయంలో 15 కిలోమీటర్లు మించి ఎక్కువ దూరం ఉంటేనే వినియోదారుల నుంచి డెలివరీ చార్జీలు వసూలు చేయాలి.

అదనంగా డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయండి



నిబంధనల మేరకు గ్యాస్ సిలిండర్ సరఫరాపై అదనపు ధర వసూలు చేయరాదు. అలా చేస్తే విచారణ చేపట్టి సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటాం. అదనపు వసూళ్లపై తనిఖీలు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లను ఆదేశించాం. డెలివరీ బాయిస్ అదనపు డబ్బు డిమాండ్ చేస్తే సంబంధిత తహసీల్దారు లేదా సీఎస్‌డీటీ, జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

– శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

అనంతపురం సిటీ: నిరుద్యోగ యువతీ యువకులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. 18 నుంచి 26 ఏళ్లలోపు వయసుండాలి. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేల వేతనంతో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించవచ్చు.

కొనసాగుతున్న ఆర్డీటీ క్రికెట్ టోర్నీ



ఉత్తమ క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: ఆర్డీటీ స్టాఫ్ క్రికెట్ టోర్నమెంట్ తొలి రౌండ్ పోటీలు ఆదివారం ముగిసాయి. స్కై రైడర్స్, కళ్యాణదుర్గం హాస్పిటల్, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి రీజియన్ కేంద్రాల జట్లు విజయం సాధించాయి. ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ క్రమంలోనే రెండో రౌండ్ పోటీలను బుక్కరాయసముద్రం రీజనల్ డైరెక్టర్ నారాయణారెడ్డి, శ్రీశైలం రీజనల్ డైరెక్టర్ పుష్ప, టోర్నీ ఆర్గనైజర్లు బీవై నాగప్ప, పి. గంగప్ప, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు ఆర్.కుమార్, ప్రవీణ్ ప్రారంభించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

విడపనకల్లు: కోడి పందెం ఆడుతున్న 15 మందిని పాల్తూరు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఎస్‌ఐ సురేష్‌బాబు వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో పోలీసులు ఆదివారం ఉదయం విడపనకల్లు మండలం కరకముక్కల సమీపంలోని పిల్లిగుండ్ల కొండ వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కోడి పందెలు ఆడుతూ విడపనకల్లుకు చెందిన ఆరుగురు, ఉరవకొండ మండలానికి చెందిన నలుగురు, వజ్రకరూరు మండలానికి చెందిన ఇద్దరు, కర్ణాటక ప్రాంతానికి చెందిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు తప్పించుకుని పారిపోగా 15 మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 13 ద్విచక్ర వాహనాలు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి చిన్నారికి గాయాలు

యాడికి: మిద్దెపై నుండి పడి ఓ చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన విష్ణు స్థానిక ఎస్‌బీఐ సమీపంలోనే ఓ అద్దె ఇల్లు రెండో అంతస్తులో నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు విష్ణు 11 నెలల వయసున్న కుమార్తె సాయి శరణ్య ఆడుకుంటూ ప్రమాదవశాత్తు 12 అడుగుల ఎత్తున్న మిద్దెపై నుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీకి యత్నం

రామగిరి: మండలంలో ప్రసిద్ధిగాంచిన నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం జరిగింది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేసినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీని బద్దలుగొట్టారన్నారు. అయితే గురువారం హుండీ కానుకలు లెక్కించడంతో అందులో కేవలం కొద్దిపాటి చిల్లర మాత్రమే ఉందన్నారు. సీసీ పుటేజీల ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కొన్నేళ్లుగా ఓ కుటుంబం కబంద హస్తాల్లో ఉన్న ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేర్చిందని ఆలయ చైర్మన్ కురుబ ముత్యాలప్ప గుర్తు చేశారు. అయితే ఈ విషయం గిట్టని వారు ఎలాగైనా ఆలయాన్ని దక్కించుకునేందుకు ఇలాంటి చవకబారు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మవారి ఆశీస్సులతో కుట్రలను తిప్పి కొడతామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. కర్ణాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

తండ్రీకొడుకు బలవన్మరణం



రామమూర్తి, సాయికుమార్ (ఫైల్)

వజ్రకరూరు: వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపం చెందిన తండ్రీకొడుకులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్పకు చెందిన ఎం.రామమూర్తి(66), ఆయన కుమారుడు ఎం.సాయికుమార్ (40) కొన్నేళ్లుగా శనగల వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో దాదాపు రూ.2 కోట్ల మేర నష్టాలను చవిచూడాల్సి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై వారు ఆదివారం రాత్రి వజ్రకరూరు మండలం గంజికుంట వద్దకు చేరుకుని పురుగుల మందు తాగారు. ఈ విషయం తెలుసుకున్న రెండో కుమారుడు హరిచరణ్ వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తూ తన తండ్రి వాడుతున్న ఫోన్ నంబర్‌ను తెలిపాడు. ఆ ఫోన్ నంబర్ లోకేషన్ ఆధారంగా పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే తండ్రీకొడుకు మృతి చెందారు. మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్ ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. హరిచరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: మాజీ మంత్రి పరిటాల సునీత కుటుంబానికి సొంత మండలంలోనే టీడీపీ కార్యకర్తలు షాక్ ఇచ్చారు. 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన వాళ్లు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రామగిరి మండలం శేషంపల్లి టీడీపీ నాయకులు ఉప్పర శివ లింగమయ్య, ఉప్పర శివయ్య, ఉప్పర రామాంజినేయులు, ఉప్పర నాగేంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ ఫలాల ప్రజల దరికి చేర్చడంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చూపిన చొరవను కొనియాడారు. 30 ఏళ్లకు పైగా అధికారంలో ఉన్న పరిటాల కుటుంబం చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సాధించారన్నారు. దీంతో తామంతా స్వచ్ఛందంగా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రామగిరి మండల కన్వీనర్ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, శేషంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో అనంత చిన్నారి

అనంతపురం: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన చిన్నారి కరణం స్నేహిత్ సింహా వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. నీటి ప్రవాహంలో ఏకంగా రెండు గంటల 21 నిమిషాల 53 సెకెండ్ల పాటు తేలియాడడం ద్వారా ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు. నగరంలోని భాష్యం స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న స్నేహిత్ సింహా గత నెల అనంతపురంలోని ఓ స్విమ్మింగ్‌పూల్‌లో చేసిన ఈ అరుదైన ప్రదర్శనను వీడియో తీసి రికార్డు కోసం పంపారు. పరిశీలన అనంతరం ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ సమయం నీటిలో తేలియాడిన అతి పిన్న వయస్కుడిగా వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డు వారుగుర్తించి తాజాగా సర్టిఫికెట్ పంపారు. దీనిపై అనంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం శివారులో పేకాట (మంగపత్త) ఆడుతున్న 16 మందిని అరెస్ట్ చేసినట్లు మడకశిర సీఐ.సురేష్‌బాబు తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ బీటీ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ.రామాంజనేయులు, సిబ్బంది ఆదివారం ఉదయం వి.అగ్రహారం గ్రామానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మంగపత్తా ఆడుతూ 16 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,60,150 నగదుతో పాటు 9 ద్విచక్రవాహనాలు, 13 సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో జిల్లా వాసులతో పాటు కర్ణాటక వాసులూ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా అపుస్మా నాయకులు

- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

హిందూపురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా హిందూపురానికి వచ్చిన ఆయన బాలయేసు కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, నాడు నేడు, విద్యా కానుక తదితర పథకాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. రేపటి భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకారం అందించాలని ఉపాధ్యాయులను కోరారు. పెండింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. 2008, 2019 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు అన్ని విధాల న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, గోపాల్, సల్మాన్‌రాజ్, పీఆర్‌టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ అశోక్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, నాగరాజు, ఈశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కరానికి కృషి

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కరానికి తానెపుడూ ముందుంటానని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయనను స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అపుస్మా నాయకులు పంచజన్య శ్రీనివాసులు, వేణుగోపాల్, రియాజ్, మధు, గౌస్, అనంతపురం జిల్లా నాయకులు పుల్లారెడ్డి, రామిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి తండాకు చెందిన శ్రీనివాసనాయక్, భారతి దంపతులు తమ కుమార్తె శిరీషతో కలసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం వజ్రకరూరుకు బయలుదేరారు. రాగులపాడు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు.

ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల ఔదార్యం



అందజేసిన డీఐపీబీతో పూర్వ విద్యార్థులు

రాప్తాడు రూరల్: అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జియాలజీ విభాగంలో 1970–73 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు డిజిటల్ ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డు (డీఐపీబీ)ను ఆ కళాశాలకు వితరణ చేశారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దాదాపు రూ.1.60 లక్షల విలువైన డీఐపీబీని అందజేశారు. పూర్వ విద్యార్థులు గనుల భూగర్భ శాఖ విశ్రాంత డైరెక్టర్ డి.రాజగోపాల్, బాంబే డైయింగ్ నాగన్న, ప్రొఫెసర్ జగన్నాథశెట్టి తదితరులు పాల్గొన్నారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ కె.నాగలక్ష్మి, డాక్టర్ దేవసేన, డాక్టర్ ఆశావాది వంశీ, డాక్టర్ అచ్యుతానంద, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

మైమరపించిన యక్షగానం



సంగీత కచేరి నిర్వహిస్తున్న సత్యసాయి యూత్ సభ్యులు, యక్షగానంలో ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న ఉత్తర కర్ణాటక సత్యసాయి భక్తులు రెండో రోజు ఆదివారం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఉదయం 'దివ్యగానామృతం' పేరుతో సత్యసాయి సన్నిధిలో సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి వైభవాన్ని చాటుతూ గానం చేశారు. సాయంత్రం ఉత్తర కర్ణాటకలోని చొక్కడి బాలవికాస్ విద్యార్థులు యక్షగానంతో మైమరిపించారు. అనంతరం కళాకారులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

భవనాల క్రమబద్ధీకరణపై నిర్లక్ష్యం

- నగరపాలక సంస్థకు రూ.3 కోట్ల వరకు సమకూరనున్న ఆదాయం
- 2019లో బీపీఎస్‌కు వచ్చిన దరఖాస్తులు 1,381
- 1,005 నిర్మాణాలకు అనుమతి



అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాల క్రమబద్ధీకరణ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా నగరపాలక సంస్థకు ఏళ్లతరబడి వచ్చే ఆదాయం రూ.3 కోట్ల వరకు గండి పడుతోంది. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదాయ వనరులపై దృష్టిసారించడం లేదు. దీని ఫలితంగా ఏళ్ల తరబడి నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయానికి గండిపడుతోంది. 2019లో బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)కు 1,381 దరఖాస్తులు రాగా, వాటిలో 1005 నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. 50 డివిజన్ల పరిధిలో 251 భవనాల క్రమబద్ధీకరణకు జాప్యం జరుగుతోంది. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై నగరపాలక సంస్థ అధికారులు డబుల్ ట్యాక్స్, తదితర అపరాధ రుసుం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. 2019లో ప్రభుత్వం బీపీఎస్‌కు అవకాశం కల్పించింది. నిర్మాణదారులు అతిక్రమణలకు సంబంధించి నూతన ప్లాన్, డాక్యుమెంట్ తదితర వివరాలతో ఆ ఏడాది నగరంలోని 1,381 మంది నిర్మాణదారులు ఒక్కొక్కరు రూ.10 వేలు చెల్లించి, ఆన్‌లైన్‌లో బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,005 మందికి బీపీఎస్ తీసుకున్నారు. తద్వారా నగరపాలక సంస్థ రూ.13.5 కోట్ల ఆదాయం వచ్చింది. మిగితా 376 మందిలో ఐదు దరఖాస్తులను నగరపాలక సంస్థ అధికారులు తిరస్కరించారు. 94 మందికి అపరాధ రుసుం విధిస్తూ సంబంధిత నిర్మాణదారులు, ఎల్‌టీపీలకు ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులు సమాచారం అందించారు. మిగిలిన 271 దరఖాస్తుల్లో ఇటీవల 16 మంది ఆన్‌లైన్‌లో బీపీఎస్ చేసుకోవాలని సమాచారం అందించారు. ఇంకా 255 మంది నుంచి ఎలాంటి స్పందనా లేదు.

టౌన్ ప్లానింగ్ నిర్లక్ష్యం:
నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో బీపీఎస్ తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణదారులు, లైసెన్స్ ఇంజినీర్లకు కనీసం అవగాహన కల్పించాలన్న ఆలోచన కూడా చేయలేదు. క్షేత్రస్థాయిలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులు కూడా పట్టించుకోవడంలేదు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వందకుపైగా భవనాలపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. బీపీఎస్ చేసుకోని వారిపైనా చార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం లేకపోలేదు.

నోటీసులు జారీ చేశాం

బీపీఎస్ త్వరితగతిన చేసుకోవాలని ఇప్పటికే నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశాం. క్షేత్రస్థాయిలోనూ పట్టణ ప్రణాళిక కార్యదర్శులను అప్రమత్తం చేసి బీపీఎస్ చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించాం. – బాలాజీ, ఏసీపీ

శరవేగంగా అభివృద్ధి పనులు

ఈ ఫొటోలు చూడండి.. నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని రెండో రోడ్డు ఎక్స్‌టెన్షన్ ఇందిరానగర్ మెయిన్ రోడ్డు నుంచి ఆర్‌కేనగర్ ఆటోస్టాండ్ వరకు 170 మీటర్ల సీసీ రోడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం. ఇందులో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, సాధారణ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. 47వ డివిజన్ పరిధిలోని రంగస్వామినగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.10.50 లక్షలతో ఐదు కాలువలు నిర్మించారు.



రంగస్వామి నగర్‌లో గడప గడపకూ నిధులతో కాలువ ఏర్పాటు చేసిన దృశ్యం



- 74 సచివాలయాల పరిధిలో 306 అభివృద్ధి పనులు
- రూ.14.80 కోట్లు కేటాయింపు

అనంతపురం క్రైం: నగరంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పలు ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వివిధ సచివాలయాల పరిధిలో రోడ్లు, కాలువలు, తదితర సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ లెక్కన నగరంలోని 50 డివిజన్ల పరిధిలో ఉన్న 74 సచివాలయాలకు రూ.14.80 కోట్లు మంజూరు చేశారు. గతేడాది మే నుంచి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వివిధ సచివాలయాల పరిధిలో పర్యటించి, స్థానిక సమస్యలు తెలుసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. మొత్తం 306 అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటి వరకు రూ.5.39 కోట్ల వ్యయంతో 119 రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్లను పూర్తి చేశారు. రూ.8.05 కోట్ల అభివద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బిల్లుల చెల్లింపులోనూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే 77 పనులకు రూ.3.14 కోట్లు విడుదల చేసింది. రూ.54 లక్షల బిల్లులను అధికారులు అప్‌లోడ్ చేశారు. రూ.1.7 కోట్ల పనుల బిల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు.

25 ఏళ్లకు కాలువకు మోక్షం



గతంలోని పాలకులు మా ప్రాంతంలో అభివృద్ధిని పట్టించుకోలేదు. అధిక వర్షాలు వస్తే ఇళ్లలోకి, ఇంటి ముందు వరద వస్తుంది. ఎప్పుడు ఏం జరుగుతుంది దేవుడా అని బిక్కుబిక్కుమని ఉండేవాళ్లం. 25 ఏళ్లకు కాలువ నిర్మాణానికి మోక్షం కలిగింది. ఇప్పుడు వర్షం వచ్చినా నీరు నిలబడకుండా వెళ్లేందుకు అనువుగా ఉంది.
– పద్మావతి, రంగస్వామి నగర్

ఆగస్టులోపు పనులు పూర్తి



నగరంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పాటు నగరపాలక సంస్థ సాధారణ, 15వ ఆర్థిక సంఘం, తదితర అభివద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న 7 మంది కాంట్రాక్టర్ల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. టెండర్ల ద్వారా ఒక్కొక్కరు 30 నుంచి 40 పనులు దక్కించుకున్నారు. ఏదిఏమైనా వచ్చే నెల ఆగస్టులో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
– భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్

ఏ సమస్య అయినా నా దృష్టికి తీసుకురండి

- అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ఏపీ ఎన్జీవో ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా నా దృష్టికి తీసుకురావాలని, ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో ఏపీ ఎన్జీవో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఎన్జీవో నూతన భవనానికి భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత, ఉద్యోగుల సంక్షేమ సంఘం నేత చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు పీఆర్సీ విషయంలో త్వరలోనే శుభవార్త వింటారన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ఎనలేనిదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్నామన్నారు. నగరంలో రూ.700 కోట్లతో అభివృద్ధిని శరవేగంగా చేస్తున్నామన్నారు. టవర్‌క్లాక్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం సమయంలో కొన్ని భవనాలు తొలగించాల్సి వచ్చిందని, ఈ సమయంలో ఎన్జీవో సంఘం నేతలు, ఉద్యోగుల సహకారం మరువలేమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా సెక్రటరీ చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా కార్యదర్శి జవహర్, ఎన్జీవో నేతలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నూతన ఎన్జీవో భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

'మణిపూర్ దుర్ఘటనకు బీజేపీ సహకారం'



అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్యగ్రహం చేస్తున్న సీపీఎం నాయకులు



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న స్త్రీ విముక్తి సంఘటన, పీడీఎస్‌ఓ నాయకులు

అనంతపురం అర్బన్: మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కేంద్రంలోని పెద్దల సహకారంతోనే అక్కడ దుర్మార్గమైన చర్యలకు కొందరు పాల్పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక లలితకళా పరిషత్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఆదివారం ర్యాలీ చేశారు. అక్కడ సత్యాగ్రహం చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం హయాంలో దుర్మార్గాలు జరుగుతున్నాయన్నారు. ఆ రాష్ట్రం మంటల్లో కాలిపోతున్నా ప్రధాని మోదీ మాట్లాడకపోవడం చూస్తుంటే, దీని వెనుక కుట్ర ఉందనేది స్పష్టమవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల అండతోనే ఈ దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశంలో ఇంత పెద్ద సైన్యం, పోలీసు వ్యవస్థ ఉన్నా, మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణలు, అమానవీయ ఘటనలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్నారు. దీన్ని కచ్చితంగా పతకం ప్రకారమే కేంద్ర ప్రభుత్వ పెద్దలు నడిపిస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు. మోదీ అధికారంలోకొచ్చిన తరువాత కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ దుర్మార్గాలకు ఒడిగడుతున్నారని విమర్శించారు. వీటిని ప్రజాతంత్రవాదులు, పౌర సంఘాలు ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, వలి, ముత్తూజ, ప్రకాశ్, వరలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి
అనంతపురం అర్బన్: మణిపూర్‌లో ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కృష్ణ కళామందిర్ నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ మణిపూర్ ఘటన అత్యంత హేయమైన చర్య అన్నారు. రెండు నెలలుగా మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న అల్లర్లు, మారణహోమాలు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేసి, శాంతిని నెలకొల్పే విషయంలో ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. మణిపూర్‌లో దుర్మార్గానికి ఒడిగట్టిన వారిని వెంటనే శిక్షించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాళ్లు వేణి, రాధ, వెంకటలక్ష్మి, రాధమ్మ, పీడీఎస్‌ఓ నాయకులు చరణ్, నరేంద్ర పాల్గొన్నారు.


మొహర్రం ప్రారంభం



అనంతపురం నాల్గో రోడ్డులో పీర్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మొహర్రం సందర్భంగా పీర్లను కొలువుదీర్చారు. నగరంలోని నాల్గో రోడ్డులో పెనుకొండ బాబయ్య పీర్లను ఆదివారం ఊరేగింపుగా తీసుకొచ్చి, మకాన్‌లో కూర్చోబెట్టారు. ఈ నెల 27న చిన్న సరిగెత్తు, 29న పానకాలు, 30న జలధి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఐదో రోడ్డులోనూ కసుమూరు కాలేషా మస్తాన్‌వలి హజరత్ మౌలాలి పేరుతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 22న స్వామి వారి దర్శనం, 27న చిన్నసరిగెత్తు, 29న పానకాల జాతర, 30న అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం జలధి, ఆగస్టు 1న స్వామి వారి చివరి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కొలువుదీరిన పీర్లు



తలుపూరులో కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు, పి.యాలేరు, తలుపూరులో శనివారం రాత్రి పీర్ల పెట్టెను మెరవణి చేసి, చావిడిలో కొలువుదీర్చారు. ఆత్మకూరులో పీర్ల పండుగకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈనెల 24న పీర్ల స్వాముల అలంకరణ, 26న చిన్న సరిగెత్తు, 27న విడిదినం, 28న పెద్ద సరిగెత్తు, 29న పీర్ల గ్రామోత్సవం, జలధి, 31న స్వామి చివరి దర్శనం ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాప్తాడు: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గత నెల 24న రాత్రి 10: 15 గంటలకు పోలీస్ మూమెంట్ సమయంలో గుర్తు తెలియని వృద్ధుడు స్పృహ తప్పి పడి ఉండడాన్ని గమనించినట్లు తెలిపారు. అతన్ని 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారన్నారు. అతని జేబులోని ఆధార్‌కార్డులో ఉన్న వివరాలను బట్టి వెంకటేష్ మూర్తి (73), తండ్రి శ్యామ్ రావు, డోర్ నంబర్ 4-317, పెనుకొండ రోడ్డు, మడకశిర గ్రామం అని ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. ఆచూకీ గుర్తించిన వారు రాప్తాడు ఎస్‌ఐ సెల్: 9440796817కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

ఓటరు జాబితాపై విచారణ చేయిస్తాం

- రాప్తాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నరసింహారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట, గణేష్‌నగర్, విద్యారణ్యనగర్, రంగారెడ్డికాలనీ, బసవతారకనగర్, వీకే నగర్ తదితర ప్రాంతాల్లో ఓటరు జాబితాలపై విచారణ చేయిస్తామని, ఎక్కడైనా గందరగోళంగా ఉన్నట్లయితే వాటి సరిదిద్దుతామని రాప్తాడు నియోజకవర్గం ఎల్రక్టోరల్ రిజి్రస్టేషన్ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 'సాక్షి' పత్రికలో 'గందరగోళంగా ఓటరు జాబితా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఉదయమే అసిస్టెంట్ ఎల్రక్టోరల్ రిజి్రస్టేషన్ అధికారి శ్రీధర మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లతో కలిసి పాపంపేటలో పర్యటించారు. ఓటర్ల జాబితాలను పట్టుకుని కొన్ని నివాసాలకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. బీఎల్‌ఓల సర్వే పూర్తయిన వెంటనే గుర్తు తెలియని డోర్ నంబర్లు, గుర్తు తెలియని ఓట్లను తొలగిస్తామన్నారు.



పాపంపేటలో ఓ ఇంటివద్ద ఓటరు జాబితా పట్టుకుని వివరాలు ఆరా తీస్తున్న రాప్తాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నరసింహారెడ్డి

పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం..
పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలో డోర్ నంబర్లు ఇష్టానుసారంగా కేటాయించారు. 4-1012 ఓ ఇంటి డోర్ నంబరైతే ఆ ఇంటికి పక్కన ఉన్న ఇంటికి 5-సిరీస్ ఉన్న నంబరు ఉంటుంది. ఒక వీధిలో చివరి ఇల్లు తర్వాత నంబరు ఎక్కడో మొదలవుతోంది. ఇవన్నీ పంచాయతీ కార్యదర్శుల అలసత్వం నిదర్శనమే. బాధ్యతా రహిత్యంగా విధులు నిర్వర్తించడం వల్లనే ఇలాంటి తప్పిదాలకు ఆస్కారమని పంచాయతీ కార్యదర్శులపై ఓ అధికారి అసహనం వ్యక్తం చేశారు.

అలరించిన నిర్విరామ సంగీత కచేరీ



పాత అయ్యప్ప ఆలయంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న అయ్యప్ప భక్తులు

అనంతపురం కల్చరల్: నగరం అయ్యప్ప భక్తిగీతాలతో మార్మోగింది. 12 గంటల నిర్విరామ సంగీత కచేరీ అందరినీ భక్తిభావంలో ముంచెత్తింది. 'నీ నామమే నా ప్రాణం' పేరిట అయ్యప్ప స్వామి అఖండ సంకీర్తన ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అనంతరం పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రంగాచారి గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప గురుస్వాముల సమావేశం జరిగింది. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు దేశ్పాండే గురుస్వామితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈశ్వరదేవి పీఠాధిపతులు శివకుమారస్వామి, వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన ప్రచారకులు శ్రీకృష్ణమాచార్యులు, డాక్టర్ చంద్రమౌళి గురుస్వామి, శంకర్, శ్రీరమణ ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు న్యాయవాది గురు ప్రసాద్, వైఎస్ ప్రకాష్ ఆచారి, గోపాల్‌స్వామి, లక్ష్మీరెడ్డి, అమర్‌నాథ్, శ్రీనివాసులు, కేశవ తదితరులు పాల్గొన్నారు.


బీఎస్‌రావు మృతి విద్యావ్యవస్థకు లోటు



బీఎస్ రావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: శ్రీచైతన్య విద్యా సంస్థల ఫౌండర్, చైర్మన్ బీఎస్ రావు మృతి విద్యావ్యవస్థకు తీరనిలోటని పలువురు వక్తలు కొనియాడారు. అనంతపురం గుత్తి రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో బీఎస్ రావు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వేలాది మంది హాజరయ్యారు. బీఎస్‌రావు చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి, కాలవ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, మాజీ మేయర్ స్వరూప, డిప్యూటీ మేయర్ గంపన్న, టౌన్ బ్యాంక్ ప్రెసిడెంట్ మురళి, సీపీఐ నారాయణ స్వామి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, ఆర్టీటీ ప్రతినిధులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, వైస్‌ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్స్, డీన్లు, ప్రైమరీ, ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్‌లు, ఏఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్ జీవితం అనుసరణీయం



తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమ, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి

అనంతపురం సిటీ: బాలగంగాధర్ తిలక్ జీవితం అనుసరణీయమని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా అన్నారు. తిలక్ జయంతి వేడుకలను నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, చింతల వెంకటరమణ స్వామి ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్తికేయుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాల సర్పదోష నివారణకు ఆలయంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



మాట్లాడుతున్న శాంతి నారాయణ

అనంతపురం కల్చరల్: మణిపూర్‌లో రావణకాష్టంలా మారుతుండడం విచారకరమని, అక్కడ శాంతి నెలకొల్పాలని వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన కవిసమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ శాంతినారాయణ, మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, సీనియర్ కవులు నబీరసూల్, జెట్టీ జయరామ్, గోవిందరాజులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనపై సత్వరమే స్పందించి శాంతిభద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమాజాన్ని చైతన్యం చేసే బాధ్యత యువతరంపై ఉందన్నారు. అనంతరం పలువురు కవులు మణిపూర్ హింసపై ఆలోచనాత్మకమైన కవితాగానంతో ఆకట్టుకున్నారు. కవులు వన్నప్ప, నర్సిరెడ్డి, డాక్టర్ ప్రగతి, షరీఫ్, డాక్టర్ బృంద, రియాజుద్దీన్, మధురశ్రీ ,రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్త్రాల వితరణ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: సామాజిక చైతన్యమే ఆవోపా లక్ష్యమని సంస్థ రాష్ట్ర చైర్మన్ అరవేటి నిర్మల అన్నారు. ఆదివారం స్థానిక రాజు రోడ్డులోని ఆర్యవైశ్య హాస్టల్ ప్రాంగణంలో ఆవోపా ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గోపామచ్చానరసింహులు, రాష్ట్ర ఆవోపా ట్రెజరర్ శంకర నారాయణ, నగర అధ్యక్షుడు జనార్దన, సెక్రటరీ సత్రసాల మంజునాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరు అనురాధ, నాగరత్నం మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

సంతల ద్వారా రూ.3.40 లక్షల ఆదాయం
అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,66790 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,73,310 మేర ఆదాయం వచ్చిందన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి
రాప్తాడు: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన గొందిరెడ్డిపల్లి, గంగలకుంట గ్రామ పెద్దలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడారు. ఈ నెల 30న మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తీసుకోండి
ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో నిర్వహించనున్న మొహర్రం పండుగకు అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించనున్న పండుగకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి అనుమతి తీసు కోవాలన్నారు.

ప్రోత్సాహం అభినందనీయం
అనంతపురం కల్చరల్: గాయనీ గాయకులుగా ఔత్సాహికులను ప్రోత్సహించడం అభినందనీయమని సంగీత విద్వాంసులు వీరాస్వామి అన్నారు. ఆదివారం అనంత సింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సపారె సింగర్స్ పాటల పోటీల ఫైనల్స్ ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక షిర్డీనగర్‌లోని వివేకానంద భవన్‌లో సపారె రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఫైనల్స్‌కు వచ్చిన చిన్నారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి, ఆకట్టుకున్నారు. సీనియర్ గాయనీగాయకులు కేవీ మహీధర్, శ్రీదేవి, మాధవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సపారె సింగర్స్ ఫైనల్ విజేతలుగా సీనియర్ విభాగంలో లక్ష్మీసాయి, జనప్రియ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో శుభమంగళ, లక్ష్మీ బహుమతులు అందుకున్నారు.

చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడిగా భాస్కర్
అనంతపురం సిటీ: చేనేత ఐక్య వేదిక సంఘం అనంతపురం పట్టణ శాఖ అధ్యక్షుడిగా తపోవనానికి చెందిన పూడూరి భాస్కర్‌ను నియమించారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.